జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com



బుధవారం | 24-6-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 709 పేజీలు: 4 వెల : రూ.7




✳ ప్రజలకు అందుబాటులో ఉండండి ✳ రౌడీషీటర్లు, హిస్టరీ షీట్లపై ప్రత్యేక నిఘా ✳ పోక్సో కేసుల పరిష్కారంపై దృష్టి సారించండి ✳ నిర్ణీత కాలపరిమితిలో ఛార్జ్‌షీట్లు దాఖలు చేయాలి ✳ నిందితులకు జైలుశిక్ష పడేలా సాక్ష్యాధారాలు సేకరించాలి ✳ మిస్సింగ్ కేసుల దర్యాప్తులో అలసత్వం వద్దు ✳ బీట్ వ్యవస్థను సమర్థంగా నిర్వహించాలి ✳ ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు తప్పనిసరి ✳ హెల్మెట్ వినియోగంపై  విస్తృతంగా అవగాహన కల్పించాలి ✳ జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి ✳ నెలవారీ నేర సమీక్ష సమావేశంలో జిల్లా పోలీసు అధికారులకు ఎస్పీ దిశానిర్దేశం

## పోలీస్ శాఖపై.. ప్రజల్లో..

# విశ్వాసం పెంచాలి

**శ్రీకాకుళం, జూన్ 23 (వార్త):** పోలీసు శాఖపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేలా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా పోలీసు అధికారులు పనిచేయాలని జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. పోక్సో, మహిళలపై జరిగే నేరాలు, ఇతర ముఖ్యమైన గ్రేవ్ కేసుల దర్యాప్తును అత్యంత ప్రాధాన్యతతో వేగవంతంగా పూర్తి చేసి, నిర్దేశించిన గడువులోపు ఛార్జ్‌షీట్లు కోర్టులకు దాఖలు చేయాలన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో జిల్లా వ్యాప్తంగా నమోదైన కేసుల పురోగతి, పెండింగ్ కేసుల దర్యాప్తు, ఛార్జ్‌షీట్ల స్థితి, నేర నియంత్రణ చర్యలు, శాంతిభద్రతల అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, గ్రేవ్, పోక్సో కేసులు, ఆస్తి నేరాలు, సైబర్ నేరాలు, మత్తు పదార్థాల అక్రమ రవాణా కేసులు, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు తదితర ప్రాధాన్యత కలిగిన కేసుల దర్యాప్తుపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ప్రతి కేసును నాణ్యతతో కూడిన దర్యాప్తు ద్వారా పూర్తి చేసి, నిందితులకు కోర్టుల్లో శిక్షలు పడేలా పటిష్టమైన సాక్ష్యాధారాలు సేకరించాలని సూచించారు. దర్యాప్తులో జాప్యం జరగకుండా పర్యవేక్షణ అధికారులు నిరంతరం సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేసి, నిర్ణీత గడువులో ఛార్జ్‌షీట్లు కోర్టులకు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వారంట్ల అమలు, నాన్-బెయిలబుల్ వారంట్ల పెండింగ్ తగ్గింపు, రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై నిఘా, మిస్సింగ్ కేసుల పరిష్కారం, పెండింగ్ పిటిషన్ల విచారణ, ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. బీట్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలో నేరాల నియంత్రణ, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ముఖ్యమైన గ్రామాలు, గ్రామ కూడళ్లు (జంక్షన్‌లు), ప్రధాన రహదారులు, ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరిగా చేపట్టాలన్నారు. అభయం హెల్మెట్ బ్యాంకు ద్వారా ప్రయాణ సమయంలో ప్రతి వాహన దారులు హెల్మెట్ ధారణ, ప్రమాదాలు నివారణ మైనర్ డ్రైవింగ్ క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని, సంకల్పం, నారీ శక్తి కార్యక్రమాలు ద్వారా గ్రామాలు, పట్టణాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, మత్తు పదార్థాల నియంత్రణ, మహిళల భద్రత, సైబర్ మోసాల నివారణపై అవగాహన కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు కెవి రమణ, పి శ్రీనివాసరావు, డీఎస్పీలు డి లక్ష్మణరావు, గోవిందరావు, భాస్కర్ రెడ్డి, భవాని, పబ్లిక్ ప్రాసిక్యూటర్ విశాలక్ష్మీ, పోలీసు లీగల్ ఎడ్వైజర్ యామిని, జిల్లా వ్యాప్తంగా ఉన్న సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.





## పాత పెన్షన్ పునరుద్ధరణపై ఏపీటీఎఫ్ హర్షం

**శ్రీకాకుళం, జూన్ 23(వార్త):** సీపీఎస్ ఉద్యోగుల్లో 2004కు ముందు నోటిఫికేషన్లలో పోస్టులు సాధించిన వారికి పాత పెన్షన్ వర్తింపజేస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడంపై ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు మామిడి భుజంగరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బుక్కూరు వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు. జీవో ఎంఎస్ నెంబర్ 57 ప్రకారం సుమారు 11 వేలమంది ఉద్యోగుల కలని రాష్ట్ర ప్రభుత్వం సాకారం చేసి, వాళ్ల కుటుంబాల్లో కొత్త వెలుగులు నింపిందని పేర్కొన్నారు. ఏపీటీఎఫ్ దృఢ సంకల్పం, అనేక పోరాటాలు, జేఏసీ సమన్వయంతో ముందుకు తీసుకెళ్లడంతో ఆ ఉద్యోగుల స్వప్నం నేడు కార్యరూపం దాల్చిందన్నారు.

## వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో అశాస్త్రీయ విధానాలు తగదు




**శ్రీకాకుళం, జూన్ 23(వార్త):** వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో అశాస్త్రీయ విధానాన్ని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు, ఎం భుజంగరావు, ప్రధాన కార్యదర్శి బి.వెంకటే శ్వర్లు ఒక ప్రకటనలో ఖండించారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెరుగు తున్న నేపథ్యంలోఈ నెలాఖరు వరకు చూసి విధి..విధానాలు రూపొందించి ఉంటే బాగుండేదన్నారు. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినప్పటికీ నిర్లక్ష్యం చేస్తూ పేదవాడికి గుణాత్మక విద్యను దూరం చేస్తోందన్నారు. పాఠశాలల సంఖ్యను పెంచి, ఉపాధ్యాయుల సంఖ్యను తగ్గించే విధంగా విధి విధానాలు రూపొందించి, అమలు చేయడాన్ని ఖండిస్తు న్నామన్నారు. అప్పర్ ప్రైమరీ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా సబ్జెక్ట్ టీచర్స్‌ని నియమించాలని కోరారు.

## ఘనంగా జగన్నాయకులు జయంతి



**మందస, జూన్ 23(వార్త):** మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ జుత్తు జగన్నాయకులు జయంతి వేడుకలు భేతాళపురంలో ఘనంగా జరిగాయి. డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన యూనివర్సిటీ బోర్డ్ మాజీ మెంబర్ బత్తిని లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జగన్నాయకులు ఆశీస్సులు తమ ఉద్దానం ప్రాంతంపై ఉండాలని భగవంతుని ప్రార్థిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలాస నియోజకవర్గ యువజన అధ్యక్షుడు దున్న హరికృష్ణ, మందస మండల వైస్సార్సీపీ ఉపాధ్యక్షుడు పులారి పితంబరం, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు తాడాల దామోదర్, మాజీ సర్పంచ్ మామిడి సింహాద్రి, గుంటు లింగరాజు, జుత్తు పాపారావు, కీలు మోహన్ రావు, తాడల అప్పలస్వామి, మడియా రుషేంద్రరావు, జుత్తు నారాయణ, సంగారు కృష్ణారావు, గుంటు చంద్రయ్య, మాజీ సర్పంచ్ గుంటు పార్వతి, పులారి తవిటయ్య, పల్లెటి రూపారావు, పుక్కళ్ళ లోకనాథం, అంబటి దుర్యోధన, గుంటు కపిల్, బత్తిని మహేష్, దున్న దుర్యోధన, జయరాం తదితరులు పాల్గొన్నారు.

## భోజనం రుచికరంగా అందించాలి

**-జమ్ము ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంఈఓ ఉప్పాడ శాంతారావు**

**- వంట ఏజెన్సీ, ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించాలని సూచన**

**నరసన్నపేట, జూన్ 23 (వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద విద్యార్థులకు అందించే భోజనాన్ని రుచికరంగా, నాణ్యతతో అందించాలని మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) ఉప్పాడ శాంతారావు సూచించారు. మంగళవారం నరసన్నపేటలోని జమ్ము ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మధ్యాహ్న భోజన నిర్వహణపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యత, పరిశుభ్రత, వంట విధానం తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారం దృష్ట్యా మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. వంట ఏజెన్సీ సభ్యులు బాధ్యతతో వ్యవహరించి విద్యార్థులకు సమయానికి, రుచికరంగా, పరిశుభ్రంగా భోజనం అందించాలని ఆదేశించారు. అలాగే ఉపాధ్యాయులు కూడా ఎప్పటికప్పుడు భోజన తయారీ, పంపిణీ విధానాన్ని పర్యవేక్షిస్తూ ఏవైనా లోపాలు ఉంటే వెంటనే సరిచేయాలని సూచించారు. విద్యార్థుల హాజరు, ఆరోగ్యం, చదువుపై మధ్యాహ్న భోజన పథకం ప్రభావం కీలకంగా ఉంటుందని, అందువల్ల ఈ పథకం అమలులో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఎంఈఓ పేర్కొన్నారు. పాఠశాలల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలవుతున్నాయో లేదో తరచూ తనిఖీలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బందికి అవసరమైన సూచనలు జారీ చేశారు.



### విశ్వేశ్వరయ్య కూరగాయల మార్కెట్..

# పునరుద్ధరణ ఎప్పుడో?

**- శిథిలావస్థలో మార్కెట్**

**- గ్రామ పంచాయతీ నిర్లక్ష్యంపై ప్రజల ఆవేదన**

**- రోడ్లపై వ్యాపారాలకు చెక్ పెట్టాలని వినతి**

**- మార్కెట్‌లోనే దుకాణాలు కేటాయించాలని విజ్ఞప్తి**



**(నరసన్నపేట)**
నరసన్నపేటలోని విశ్వేశ్వరయ్య కూరగాయల మార్కెట్ నిర్వహణపై గ్రామ పంచాయతీ నిర్లక్ష్య వైఖరి విడనాడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. కాలక్రమేణా శిథిలావస్థకు చేరుకున్న ఈ మార్కెట్ పునర్నిర్మాణానికి వెంటనే చర్యలు చేపట్టి వ్యాపారులకు, వినియోగదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్ భవనం దెబ్బతిన్న స్థితిలో ఉండటంతో వ్యాపారులు, కొనుగోలుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు చెబుతున్నారు. మార్కెట్‌లో తగిన సదుపాయాలు లేకపోవడంతో కొంతమంది వ్యాపారులు రోడ్లపైనే కూరగాయల వ్యాపారం నిర్వహిస్తున్నారని, దీంతో ప్రధాన రహదారులపై ట్రాఫిక్ సమస్యలు తీవ్రమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో ఖాళీగా ఉన్న షాపులను రోడ్లపై వ్యాపారం చేస్తున్న వారికి కేటాయిస్తే ట్రాఫిక్ సమస్య కొంత వరకు తగ్గే అవకాశం ఉందని పట్టణ ప్రజలు సూచిస్తున్నారు. మార్కెట్‌లోనే వ్యాపారం జరిగేలా చర్యలు తీసుకుంటే వినియోగదారులకు కూడా సౌకర్యంగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

పట్టణ అభివృద్ధిలో భాగంగా మార్కెట్‌ను ఆధునీకరించి, తాగునీరు, పారిశుధ్యం, డ్రైనేజీ, షెడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రజలు కోరుతు న్నారు. ఎన్నో ఏళ్లుగా సమస్యలు ఉన్నప్పటికీ గ్రామ పంచా యతీ నుంచి స్పష్టమైన చర్యలు కనిపించకపోవడం నిరాశ కలిగిస్తోందని అంటున్నారు. ప్రజలకు అవసరమైన ప్రధాన వాణిజ్య కేంద్రంగా ఉన్న విశ్వేశ్వరయ్య కూరగాయల మార్కెట్ దుస్థితిపై సంబంధిత అధికారులు, ప్రజా ప్రతి నిధులు వెంటనే స్పందించి పునరుద్ధరణకు చర్యలు తీసు కోవాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## గిరిజన రైతుల ఆర్థిక పురోభివృద్ధే లక్ష్యం




**మందస, జూన్ 23(వార్త):** ఐటీడీఏ సీతంపేట ఆధ్వర్యంలో ఆధునిక వ్యవసాయ పరికరాల పంపిణీ కార్యక్రమం జరిగింది. పలాస నియోజకవర్గంలోని మందస మండలానికి చెందిన కొండలోగాం, కుసుమల, టంగరాపుట్టి పంచాయతీల గిరిజన రైతుల జీవితాల్లో ఆధునిక వ్యవసాయ వెలుగులు నిండాయి. గిరిజన కుటుంబాలు, రైతులు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలన్న సత్సంకల్పంతో, సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో ఈ వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గిరిజన రైతులకు అత్యాధునిక పవర్ టిల్లర్లు, పవర్ వీడర్లు, వాటర్ ఇంజన్లు, మినీ ట్రాక్టర్లను అందజేశారు. సాంప్రదాయ వ్యవసాయం నుండి ఆధునిక సేద్యం వైపు గిరిజన రైతులను నడిపించడం, తద్వారా సాగు ఖర్చులు తగ్గించి దిగుబడులు పెంచడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం. ఈ పరికరాల ద్వారా గిరిజన రైతులు తమ సాగు పరిధిని మరింత విస్తరించుకునేందుకు, ఉత్పాదకతను పెంచుకునేందుకు గొప్ప అవకాశం లభించింది. పంపిణీ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ కార్యకర్త సవర లక్కా, యూనిట్ కన్వీనర్ ప్రశాంత్, బూత్ కన్వీనర్ సవర కేదారావు, సవర అప్పన్నలతో పాటు పలువురు ముఖ్య నాయకులు, ఐటీడీఏ అధికారులు, గిరిజన రైతులు పాల్గొన్నారు. ప్రభుత్వ సాయంతో అందిన ఈ యంత్రాలు తమ వ్యవసాయానికి ఎంతో ఊరటనిస్తాయని గిరిజన రైతులు ఈ సందర్భంగా ఆనందం వ్యక్తం చేశారు.

## జగన్నాయకులు ఆశయసాధనకు కృషి

**మందస, జూన్ 23(వార్త):** మాజీ ఎమ్మెల్యే జుత్తు జగన్నాయకుల ఆశయసాధనకు కృషి చేయాలని వైఎస్సార్సీపీ నేత మడియా రామకృష్ణ పిలుపునిచ్చారు. మందస మండలం నారాయణపురం పంచాయతీలో మాజీ ఎమ్మెల్యే జుత్తు జగన్నాయకుల జయంతి వేడుకలను వైయస్సార్సీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ సామాన్య మత్స్యకార కుటుంబంలో జన్మించి, ప్రజా సేవకే జీవితాన్ని అంకితం చేసిన జుత్తు జగన్నాయకులు పలాస ఎమ్మెల్యేగా ఒక్కసారి గెలిచినా ఉద్దానం, ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి బాటలు వేశారన్నారు. ప్రతీ మారుమూల గ్రామానికి పక్కా రోడ్లు, సిరిపురం-పొత్తంగి వంటి కీలక బ్రిడ్జిల నిర్మాణం, పలాస-కాశిబుగ్గ పురపాలక సంఘం అభివృద్ధి, ఇందిరమ్మ ఇళ్లు, సాగునీటి కాలువల ఆధునీకరణతో ఆయన చేసిన సేవలు నేటికీ ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మడియా రామకృష్ణ మాట్లాడుతూ జుత్తు జగన్నాయకులు ఒక్క పర్యాయం ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించినప్పటికీ, ఉద్దానం ప్రాంతమే కాక ఆదివాసీ ప్రాంతాల రూపురేఖలు మార్చే విధంగా చేసిన అభివృద్ధి కొన్ని తరాల వరకు చెప్పుకునే విధంగా ప్రజల్లో శాశ్వతంగా గుర్తుండిపోయే నాయకుడని కొనియాడారు. ప్రధానంగా పలాస నియోజకవర్గంలో ప్రతి మారుమూల గ్రామానికి పక్కా రహదారి సౌకర్యం కల్పించిన ఘనత ఆయనదేనని తెలిపారు. కీలకమైన సిరిపురం-పొత్తంగి బ్రిడ్జి నిర్మాణంతో పాటు అనేక బ్రిడ్జిలు, పలాస-కాశిబుగ్గ పురపాలక సంఘం అభివృద్ధికి కృషి చేశారన్నారు. నిరుపేదలకు ఇందిరమ్మ నివాస గృహాలు మంజూరు చేయడంతో పాటు వివిధ సంక్షేమ పథకాల అమలు, సాగునీటి అవసరాలపై రైతాంగానికి అండగా నిలుస్తూ అనేక సాగునీటి కాలువలను ఆధునీకరించారని వివరించారు. ఇతర మౌలిక రంగ సౌకర్యాలకు పెద్దపీట వేసిన ఘనత జుత్తు జగన్నాయకులకే చెందుతుందని పేర్కొన్నారు. ప్రధానంగా పలాసలో కిడ్నీ రీసెర్చ్ కేంద్రం నిర్మాణానికి డాక్టర్ సీదిరి అప్పలరాజు కృషి చేయడంలో జుత్తు జగన్నాయకుల ఆశయం నెరవేర్చినట్లేనని రామకృష్ణ తెలిపారు. రానున్న రోజుల్లో కూడా ఆయన ఆశయాలు కొనసాగిస్తామని, ఉద్దానం అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో మందస మండల అగ్నికుల క్షత్రియ ఉపాధ్యక్షుడు కర్రి బాలకృష్ణ, మాజీ సర్పంచ్ బత్తిని తేజేశ్వరరావు, ఉప సర్పంచ్ మడియా శ్రీరాములు, గొరకల పవన్ కుమార్, మడియా దానేష్, సింహాచలం, గొరకల జగన్, మల్లేన లక్ష్మీనారాయణ, దూర్వాసులు, పలువురు యువకులు పాల్గొన్నారు.



## ప్రతి ఫోన్‌లో శక్తి యాప్ ఉండాలి

**- ఆపద సమయంలో మహిళలకు రక్షణ**

**-ఉపాధి హామీ వేతనదారులకు వివరించిన శక్తి టీం సిబ్బంది**




**జలుమూరు, జూన్ 23 (వార్త):** ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్ కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ 'శక్తి' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని శక్తి టీం సిబ్బంది హెచ్‌సీ ఎం. గిరిధర్, కానిస్టేబుళ్లు భీమారావు, విజయలక్ష్మి సూచించారు. మంగళవారం జలుమూరు మండలం టి.లింగాలపాడులో ఉపాధి హామీ వేతనదారులకు శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సెల్‌ఫోన్‌లో శక్తి యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయం పొందే అవకాశం ఉంటుందని వివరించారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, ఒంటరిగా ప్రయాణించే వారు ఈ యాప్‌ను వినియోగించడం ద్వారా భద్రత పరంగా ప్రయోజనం పొందవచ్చని తెలిపారు. ఆపద సమయంలో యాప్‌లోని ఎమర్జెన్సీ ఫీచర్‌ను ఉపయోగించడం ద్వారా పోలీసులకు వెంటనే సమాచారం చేరుతుందని, తద్వారా సత్వర రక్షణ చర్యలు చేపట్టే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి కుటుంబంలో కనీసం ఒకరి ఫోన్‌లో అయినా శక్తి యాప్ ఉండేలా చూసుకోవాలని సూచించారు. శక్తి యాప్ వినియోగంపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలను గ్రామస్థాయిలో కొనసాగిస్తామని తెలిపారు. ఉపాధి హామీ వేతనదారులు యాప్ వినియోగంపై ఆసక్తి కనబరిచి, దాని ఉపయోగాల గురించి తెలుసుకున్నారు.

### మాదకద్రవ్యాల నివారణపై..

## విద్యార్థులకు అవగాహన

**- నషా ముక్త్ అభియాన్ ప్రతిజ్ఞ చేసిన మోడల్ స్కూల్ విద్యార్థులు**

**- ప్రాథమిక స్థాయి నుంచే చైతన్యం కల్పిస్తున్నామని ప్రిన్సిపాల్ వెల్లడి**



**జలుమూరు, జూన్ 23 (వార్త):** మాదకద్రవ్యాల వినియోగ నివారణపై విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే అవగాహన కల్పిస్తున్నామని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రఘుపాత్రుని శివకుమార్ తెలిపారు. మంగళవారం జలుమూరు మండలం కరవంజలోని ఏపీ మోడల్ స్కూల్‌లో నషా ముక్త్ అభియాన్ కార్యక్రమం నిర్వహించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఉదయం ప్రార్థన కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై వివరించారు. విద్యార్థి దశలోనే చెడు అలవాట్లకు దూరంగా ఉండాల్సిన అవసరం ఉందని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రఘుపాత్రుని శివకుమార్ మాట్లాడుతూ, విద్యాశాఖ ఆదేశాల మేరకు నషా ముక్త్ అభియాన్ కార్యక్రమాన్ని పాఠశాలలో నిర్వహిస్తున్నామని తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తిగత జీవితం, కుటుంబం, సమాజంపై కలిగే ప్రతికూల ప్రభావాలపై విద్యార్థులకు చైతన్యం కల్పిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండడమే కాకుండా తమ కుటుంబ సభ్యులు, స్నేహితుల్లో కూడా అవగాహన పెంచేలా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తు తరాలు ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలంటే ఇలాంటి కార్యక్రమాలు అవసరమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 28న పల్స్‌పోలియో




**జి.సిగడాం, జూన్ 23(వార్త):** ఈ నెల 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని జి.సిగడాం, బాతువ పీహెచ్‌సీ పరిధిలో ఉన్న ఏఎన్ఎం, అంగన్‌వాడీ, ఆశా తదితర ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని డాక్టర్ అనూష, ప్రతిష్టశర్మ, యశ్వంత్, సుమబిందు ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం వారు ఒక ప్రతికా ప్రకటన విడుదల చేశారు. మండలంలో పోలియో చుక్కలు వేసేందుకు 32 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 1500 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. 29, 30 తేదీల్లో సిబ్బంది ఇంటింటికి తిరిగి మిగిలిన వారికి పోలియో చుక్కలు వేయనున్నట్లు పేర్కొన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక

# గ్రామీణ ఆరోగ్య సేవలు బలోపేతం

**- మాకివలస పీహెచ్‌సీలో ఆసుపత్రి సలహా సంఘం సమావేశంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి**

**- పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యమందించడమే లక్ష్యమని స్పష్టం**



**నరసన్నపేట, జూన్ 23 (వార్త):** గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల బలోపేతానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పేర్కొన్నారు. మంగళవారం మాకివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన హాస్పిటల్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఆరోగ్య సేవల మెరుగుదలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు మొదటి స్థాయి వైద్య సేవలు అందించే కేంద్రాలుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. పీహెచ్‌సీలలో మౌలిక వసతులు, వైద్య సిబ్బంది అందుబాటు, మందుల నిల్వలు, అత్యవసర సేవలు వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే పేద, మధ్యతరగతి రోగులకు అవసరమైన అన్ని రకాల మందులు నిరంతరం అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. రోగులు ప్రైవేట్ మెడికల్ షాపులపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా ఉచితంగా నాణ్యమైన మందులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. వైద్యులు, నర్సులు స్థానికంగా అందుబాటులో ఉంటూ రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని ఆయన సూచించారు. ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రతి రోగిని సేవాభావంతో చూడాలని, గ్రామీణ ప్రజల్లో ప్రభుత్వ ఆసుపత్రులపై పూర్తి నమ్మకం పెంచేలా వైద్య సిబ్బంది పనిచేయాలని కోరారు. గ్రామీణ ఆరోగ్య సంరక్షణలో పీహెచ్‌సీలు మొదటి రక్షణ వలయంగా నిలుస్తాయని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్యం అందించడమే ప్రభుత్వాల ప్రధాన సంకల్పమని ఆయన స్పష్టం చేశారు. ఆసుపత్రి సలహా సంఘం సమావేశంలో పీహెచ్‌సీలో అవసరమైన సదుపాయాలు, రోగుల అవసరాలు, సిబ్బంది పనితీరు, సేవల మెరుగుదలపై చర్చించినట్లు తెలిసింది. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు మరింత సమర్థంగా అందేలా ప్రభుత్వం దశలవారీగా చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన, నరసన్నపేట వంశధార డిస్ట్రిబ్యూటరి కమిటీ చైర్మన్ శిమ్మ చంద్రశేఖర్, యూనిట్ ఇన్‌చార్జి యాళ్ల వేణుగోపాలరావు, మాజీ సర్పంచ్ యాళ్ల ధర్మారావు, వైద్యులు, ఆరోగ్య శాఖ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మండల పరిషత్ నిధులతో రహదారి అభివృద్ధికి శ్రీకారం



**నరసన్నపేట, జూన్ 23 (వార్త):** నరసన్నపేటలో మండల పరిషత్ నిధులతో రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని మండల విప్, ఎంపీటీసీ వైశ్యరాజు కేశవరాజు తెలిపారు. మంగళవారం వీరన్నాయుడు కాలనీలో బొంతల వీధి నుంచి సంతోషిమాత దేవాలయం వరకు రహదారి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో రూ.2 లక్షల నిధులను మంజూరు చేసి రహదారి నిర్మాణ పనులు ప్రారంభించినట్లు చెప్పారు. కాలనీలోని ప్రజలు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న ఈ పనులు పూర్తయితే రాకపోకలు మరింత సులభతరం అవుతాయని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా మండల పరిషత్ నిధులను సమర్థంగా వినియోగిస్తున్నామని ఆయన తెలిపారు. గ్రామాలు, కాలనీల అభివృద్ధికి అవసరమైన రహదారులు, తాగునీరు, డ్రైనేజీ వంటి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో సమన్వయం చేసుకుంటూ మిగిలిన సమస్యల పరిష్కారానికి కూడా చర్యలు తీసుకుంటామని కేశవరాజు వివరించారు. ఈ రహదారి నిర్మాణంతో వీరన్నాయుడు కాలనీ పరిసర ప్రాంత ప్రజలకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడటంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గే అవకాశం ఉందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రభుత్వ పాఠశాల ఆవరణలో కూలిన చెట్టు

**- మూడు రోజులైనా తొలగించని అధికారులు**

**- పాఠశాల మూతపడటంతో తప్పిన పెను ప్రమాదం**

**నరసన్నపేట, జూన్ 23 (వార్త):** నరసన్నపేట మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో భారీ చెట్టు కూలి మూడు రోజులు గడిచినా సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలుల ప్రభావంతో చెట్టు ఒరిగి పాఠశాల ప్రాంగణంలో పడిపోయిందని సమాచారం. అదృష్టవశాత్తూ ఈ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల గత రెండు సంవత్సరాలుగా మూతపడిన నేపథ్యంలో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు. పాఠశాల నడుస్తున్న సమయంలో ఇదే ఘటన జరిగి ఉంటే విద్యార్థులు, సిబ్బందికి ప్రాణాపాయం ఏర్పడేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూలిన చెట్టు పాఠశాల ఆవరణలోనే అలాగే ఉండిపోవడంతో పరిసర ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు, గాలులు కొనసాగుతున్న నేపథ్యంలో మిగిలిన కొమ్మలు కూడా విరిగి పడే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. పాఠశాల భవనం, ఆవరణ భద్రత దృష్ట్యా వెంటనే చెట్టును తొలగించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రజా భవనాల పరిసరాల్లో ప్రమాదకర పరిస్థితులు ఏర్పడినప్పుడు అధికారులు వెంటనే స్పందించి నివారణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. కనీసం కూలిన చెట్టును తొలగించి ప్రాంగణాన్ని శుభ్రపరిచేలా సంబంధిత శాఖలు తక్షణ చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



## హెల్మెట్ మరవొద్దు.. కుటుంబానికి దూరం కావొద్దు!

**- కాశీబుగ్గ డీఎస్పీ భవాని**



**సోంపేట, జూన్ 23 (వార్త):** ద్విచక్ర వాహనదారులు ప్రయాణ సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ హెల్మెట్ మరువ వద్దని ప్రమాదాలతో వారి కుటుంబాలకు దూరం కావద్దని కాశీబుగ్గ డిఎస్పి టి. భవాని హితవు పలికారు. ప్రయాణంలో ప్రమాదాలు జరిగే సందర్భాల్లో ప్రాణం కాపాడేది ఒక్క హెల్మెట్ మాత్రమేనని ఆమె పేర్కొన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో సోమవారం రాత్రి జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి వ్యక్తి ప్రయాణంలో హెల్మెట్ పట్ల నిర్లక్ష్యం చేయవద్దని పేర్కొన్నారు. తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు లేక నిలువు నా ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. ప్రమాద సమయంలో హెల్మెట్ ఉండటం వలన తల సురక్షితంగా ఉంటుందని తద్వారా ప్రాణాపాయం నుంచి రక్షించబడతారని అన్నారు. ప్రాణం ఖరీదు చాలా విలువైనదని గుర్తు చేశారు. నిర్లక్ష్య ప్రయాణాలు ద్వారా ప్రాణాలు కోల్పోయి ఆయా కుటుంబాలకు ఆసరా లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబాలకు అండగా ఉండవలసిన వ్యక్తులు రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయాలై ప్రాణాలు కోల్పోవడం ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపుతుందని అన్నారు. చేతులారా ప్రాణాల్ని కోల్పోవడం అంటే మన నిర్లక్ష్యమేనని డిఎస్పి పేర్కొన్నారు. రోడ్లపై పోలీసులు పట్టించుకోవడం లేదన్న తేలిక భావనతో హెల్మెట్ ధరించకుండా ప్రయాణించడం వారికి, వారి కుటుంబాలకు తీవ్ర ప్రమాదకరమని హెచ్చరించారు.

## టిడ్కో ఇళ్లు రాకుంటే డిపాజిట్ రిఫండ్

**పలాస, జూన్ 23(వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పలాస–కాశీబుగ్గ పురపాలక సంఘ పరిధిలో ఏపీటిడ్కో పథకం కింద 300 చదరపు అడుగులు, 360 చదరపు అడుగులు, 430 చదరపు అడుగుల గృహాల కోసం దరఖాస్తు చేసుకుని సంబంధిత మొత్తాలను డిమాండ్ డ్రాఫ్టుల రూపంలో చెల్లించినప్పటికీ గృహాలు మంజూరు కాని కొంతమంది దరఖాస్తుదారులకు ప్రభుత్వం శుభవార్త అందించింది. వివిధ కారణాల వల్ల గృహాల కేటాయింపు జరగకపోవడంతో వారు చెల్లించిన మొత్తాలను తిరిగి చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు పలాస–కాశీబుగ్గ పురపాలక సంఘం కమిషనర్ ఐ శ్రీనివాస్ తెలిపారు. గృహాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల వివరాలను ప్రభుత్వం సమగ్రంగా పరిశీలించింది. దరఖాస్తుదారులు చెల్లించిన డిమాండ్ డ్రాఫ్టులు, మున్సిపల్ రసీదులు, ఇతర సంబంధిత పత్రాలను పరిశీలించిన



అనంతరం ఇళ్లు మంజూరుకాని వారిని గుర్తించి, వారు చెల్లించిన మొత్తాలను తిరిగి అందజేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఇళ్లు మంజూరుకాని దరఖాస్తుదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం 3 గంటలకు కాశీబుగ్గ పురపాలక సంఘ కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత దరఖాస్తుదారులు తమ వద్ద ఉన్న అసలు డిమాండ్ డ్రాఫ్టుల పత్రాలు, మున్సిపల్ రసీదులు, గుర్తింపు కార్డులు, ఇతర అవసరమైన పత్రాలతో నిర్ణీత సమయానికి కార్యక్రమానికి హాజరుకావాలని పురపాలక సంఘం అధికారులు కోరారు. పత్రాల పరిశీలన అనంతరం మాత్రమే చెక్కుల పంపిణీ చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పారదర్శకంగా వ్యవహరిస్తోందని, గృహాల కేటాయింపు జరగని అభ్యర్థులకు వారు చెల్లించిన మొత్తాలను తిరిగి అందించడం ద్వారా వారి ఆర్థిక భారం తగ్గించేందుకు కృషి చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్

**పలాస, జూన్ 23 (వార్త):** ఒకే దేశం, ఒకే రాజ్యాంగం, ఒకే జెండా అనే లక్ష్యంతో కాశ్మీర్ కోసం బలిదానం అయిన భారతీయ వ్యవస్థాపకులు, జనసంఘ ప్రాత ఃస్మరణీయులు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ ఘన సందర్భంగా మంగళవారం ఆయనకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ శ్రీకాకుళం జిల్లా ఉపాధ్యక్షులు పాలవలస వైకుంఠ రావు, పూర్వ పలాస నియోజకవర్గం కన్వీనర్ రామానంద స్వామి, జిల్లా మైనారిటీ మోర్చా అధ్యక్షులు గని, పలాస అర్బన్ మండలం అధ్యక్షులు పొట్నూరు తారకేశ్వర రావు, పూర్వ జిల్లా ఉపాధ్యక్షులు కొర్రయి బాలకృష్ణ, టౌన్ ప్రధాన కార్యదర్శి బొండా శ్రీనివాస రావు, టౌన్ బీజేవైఎం అధ్యక్షులు పొందర ఈశ్వర రావు, బిజెపి సీనియర్ నాయకులు కాంచరాణ భుజంగరావు, భీమారావు మొదలగువారు పాల్గొన్నారు.



## శ్రీకాకుళం

### గొల్లలవలసలో నవగ్రహ, సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు

**- మూడు రోజులపాటు ఆధ్యాత్మిక వేడుకలు**

**- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న జడ్పీటీసీ కృష్ణచైతన్య**



**పోలాకి, జూన్ 23 (వార్త):** గొల్లలవలస గ్రామంలో నవగ్రహ, సుబ్రహ్మణ్య స్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ప్రారంభమయ్యాయి. మంగళవారం ప్రారంభమైన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలు గురువారం వరకు కొనసాగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పోలాకి జడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య మహోత్సవాల్లో పాల్గొని నవగ్రహాలు, సుబ్రహ్మణ్య స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి, గ్రామ ప్రజల సుఖశాంతుల కోసం ప్రార్థనలు నిర్వహించినట్లు తెలిపారు. గ్రామంలో ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు జరగడం పట్ల స్థానిక భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు గ్రామంలో ఐక్యత, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు. మహోత్సవాల సందర్భంగా భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమాలు ముగిసే వరకు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనే అవకాశం ఉందని పేర్కొన్నారు.

### ఆటపాటలతో కూరగాయలపై విద్యా బోధన

**- విద్యార్థుల్లో ఆసక్తి పెంచుతున్న వినూత్న విధానం**

**- ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు ప్రాధాన్యం**



**సారవకోట, జూన్ 23 (వార్త):** వెంకటాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు కూరగాయలపై ఆటపాటలతో వినూత్నంగా బోధన చేపట్టారు. విద్యార్థుల్లో అభ్యాసంపై ఆసక్తి పెంపొందించడంతో పాటు పాఠ్యాంశాలు సులభంగా గుర్తుండేలా చేయడమే ఈ విధాన లక్ష్యమని పాఠశాల హెచ్‌ఎం ఎం. ఈశ్వర్ భాయ్ తెలిపారు. మంగళవారం నిర్వహించిన ఈ బోధన కార్యక్రమంలో విద్యార్థులకు కూరగాయల పేర్లు, వాటి ఉపయోగాలు, పోషక విలువలపై పాటలు, ఆటల రూపంలో అవగాహన కల్పించారు. సంప్రదాయ బోధనతో పాటు ఇలాంటి సృజనాత్మక పద్ధతులను అనుసరించడం వల్ల విద్యార్థులు పాఠాలను సులభంగా అర్థం చేసుకోవడంతో పాటు ఎక్కువకాలం జ్ఞాపకం ఉంచుకోగలుగుతారని హెచ్‌ఎం వివరించారు. ప్రస్తుతం పాఠశాలలో 13 మంది విద్యార్థులు చదువుతున్నారని, విద్యా ప్రమాణాలు మెరుగుపరచడం ద్వారా విద్యార్థుల సంఖ్యను మరింత పెంచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని చెప్పారు. ఈ వినూత్న బోధన విధానంపై విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఆటలతో, పాటలతో పాఠాలు నేర్చుకోవడం ఆసక్తికరంగా ఉందని, పాఠశాలకు రావాలనే ఉత్సాహం పెరుగుతోందని పేర్కొన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, చురుకుదనం, నేర్చుకునే ఆసక్తి పెంపొందించేందుకు ఇలాంటి బోధనా కార్యక్రమాలు మరింత ఉపయోగపడతాయని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు.

### తహసీల్దార్ విజయలక్ష్మికి పదోన్నతి

**- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియామకం**

**- సీఆర్‌డీఏలో బాధ్యతలు**



**సారవకోట, జూన్ 23 (వార్త):** సారవకోట మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న కొత్త విజయలక్ష్మికి ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ఆమెను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ప్రమోట్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సోమవారం రాత్రి పదోన్నతికి సంబంధించిన ఉత్తర్వులు అందినట్లు కొత్త విజయలక్ష్మి తెలిపారు. పదోన్నతితో పాటు ఆమెను రాష్ట్ర రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థలో నియమించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా కొత్త విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా కొత్త బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తానని తెలిపారు. త్వరలోనే కొత్త పదవిలో బాధ్యతలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. సారవకోట మండలంలో తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో పరిపాలన, ప్రజా సేవల విషయంలో ఆమె చూపిన చొరవకు గుర్తింపుగానే ఈ పదోన్నతి లభించిందని అధికారులు, సిబ్బంది అభిప్రాయపడుతున్నారు. ఆమెకు సహచర ఉద్యోగులు, స్థానికులు అభినందనలు తెలియజేశారు.

### మండపల్లికి సీసీ రోడ్డు సౌకర్యం

**కంచిలి, జూన్ 23(వార్త):** మండపల్లి గ్రామంలో గల రజక వీధికి ఎంతోకాలంగా వేధిస్తున్న రహదారి సమస్యను కూటమి నాయకులు పరిష్కరించారు. సిమెంట్ రహదారి సౌకర్యం కల్పించారు. ఈ మేరకు మంగళవారం ఐదు లక్షల రూపాయల అంచనా వ్యయంతో, 160మీటర్ల పొడవైన సిమెంట్ రహదారి నిర్మాణాన్ని చేపట్టారు. ఆ వీధి ప్రజలు కూటమినేతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు మాదిన రామారావు తదితరులు పాల్గొన్నారు.



# పెంటలానే ఉంది!

- ఆ గ్రామంలో పడకేసిన పారిశుధ్యం
-పేరుకుపోతున్న మురుగు, చెత్త
-పర్యవేక్షించని ప్రత్యేకాధికారులు
-మాటలు తప్ప చేతలు శూన్యం

(జి.సిగడాం)

జి.సిగడాం మండల పరిధిలోని పెంట గ్రామంలో పలు వీధుల్లో పారిశుధ్యం పడకేసింది. ప్రత్యేకాధికారుల పాల నలో ఎక్కడి చెత్త అక్కడే అన్న చందంగా తయారైంది. కాలువల్లో పూడికలు నిండిపోయినా పట్టించుకునే వారే కరువయ్యారు. అధికారుల సరైన పర్యవేక్షణ లేకపోవడంతో చిన్నపాటి వర్షం పడ్డా..కాలువల్లో డ్రైనేజీ మురుగు నిండి రోడ్డుపై ప్రవహిస్తూ.. చెత్తా.. చెదారంతో అపారిశుధ్యంగా మారి మెయిన్ రోడ్డు పై మురుగు చేరిపోతోంది. గ్రామంలో అటు వైపు నివాసం ఉంటున్న ప్రజలు దుర్వాసనతో నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ డ్రైనేజీతో స్థానికంగా అక్కడ నివాసముంటున్న చిన్నారులు జ్వరాలు గురి చెందుతు న్నారని ప్రజలు వాపోతున్నారు. మౌలిక సదుపాయాలు ప్రభుత్వానికి, అధికారులకు పట్టవా అని వాపోతున్నారు. అధికారులు స్వచ్ఛ ఆంధ్ర– స్వర్ణ ఆంధ్ర పేరిట మాటలు తప్ప.. చేతలు శూన్యం అంటూ ప్రజలు పెదవి విరుస్తు న్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తగు చర్యలు తీసు కోవాలని వారు కోరుతున్నారు.



## కళింగదళ్ రిజర్వాయర్ పనులను పరిశీలించిన ఎంఎల్ఏ శిరీష



**మందస, జూన్ 23(వార్త):** కళింగదళ్ రిజర్వాయర్ పనులను ఎంఎల్ఏ గౌతు శిరీషా మంగళవారం పరిశీలించారు. పలాస నియోజకవర్గం మందస మండలంలోని కళింగదళ్ రిజర్వాయర్ ఆయకట్టు భూములు సాగునీటి కాలువలు గత 15ఏళ్లుగా ఏవిధమైన పూడికతీత, మధుముల షట్టర్లు రిపేర్లు జరగలేదని, శాసనసభ్యురాలు గౌతు శిరీష కృషితో సాగునీటి కాలువల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించి సకాలంలో పనులు పూర్తి కావాలని ఆదేశించడం జరిగిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులు జరుగుతున్న తీరును శిరీషా పర్యవేక్షించారు. పొలం ఎండి, నీళ్లు లేక బాధపడిన రోజులు పోయాయని శిరీషా అన్నారు. స్వయంగా ఎంఎల్ఏ శిరీషా చొరవ తీసుకుని కాలువ పనులు మొదలు పెట్టించారు. పంటలు బాగా పండాలని, రైతు బాగుపడాలని శిరీషా అన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు భావన దుర్యోధన, లబ్బ రుద్రయ్య, తమరియా భాస్కరరావు, రట్టి లింగరాజు, ముంజేటి చంద్రశేఖర్, బేసి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అగ్నివీర్ కు ఎంపికైన పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి




**పలాస, జూన్ 23(వార్త):** ఇండియన్ ఎయిర్ ఫోర్స్(అగ్ని వీర్) కు ఎంపికైన పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి బోనెల కార్తీక్‌కు మంగళవారం అభినందనలు తెలియజేశారు. పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి బోనెల కార్తీక్ ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (అగ్నివీర్) ఉద్యోగానికి ఎంపిక కావడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. వెంకటలక్ష్మి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అతి చిన్న వయస్సులోనే దేశ రక్షణకు సంబంధించిన ప్రతిష్ఠాత్మకమైన ఉద్యోగాన్ని సాధించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకొని, కృషి, పట్టుదలతో ముందుకు సాగితే విజయాలను అందుకోవచ్చని తెలిపారు. బోనెల కార్తీక్ సాధించిన ఈ విజయం ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. దేశానికి సేవ చేయడంతో పాటు తన కుటుంబానికి గౌరవం తీసుకురావడం ఎంతో ప్రశంసనీయమని పేర్కొంటూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కళాశాల తరఫున విద్యార్థికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పి. వెంకటరమణ, సైన్స్ విభాగాధిపతి ఎన్. శ్రీనివాస్ పట్నాయక్, లైబ్రేరియన్ బి నరసింహులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## అభాగ్యులకు అండగా...



**కవిటి, జూన్ 23(వార్త):** రాజపురం గ్రామానికి చెందిన శ్రీ సత్య సాయి భజన మండలి సభ్యులు ప్రతినెల అభాగ్యులకు అండగా నిలిచే నిత్యవసర సరుకుల పంపిణీ కార్యక్రమం ఈనెల కూడా మంగళవారం చేపట్టారు. ఎన్నో ఏళ్లుగా కొనసాగిస్తున్న ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుంది. ఈ నెలలో ఐదు కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యవసర సరుకులను ఉచితంగా అందజేశారు. రాజపురం గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఆణింగి లక్ష్మీనారాయణ కుటుంబానికి అలాగే కవిటి గ్రామానికి చెందిన నాగుల దాలమ్మ బెహరా, ఆకుల దుర్జో బెహరా కుటుంబాలకు, పొందూరు పుట్టుగ గ్రామంలో పొందూరు కృష్ణవేణి, రాజపురంలో రత్నాల కృష్ణారావు కుటుంబాలకు సహాయం అందజేశారు. ఆయా కుటుంబాల తో పాటు గ్రామస్తులు భజన మండలి సభ్యులను అభినందించారు. పొందూరు పుట్టుగ పంపిణీ కార్యక్రమంలో పొందూరు నారాయణ,బింగి తాతయ్య, పొందూరు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## నువ్వులరేవులో సచివాలయ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే శిరీష

**పలాస, జూన్ 23(వార్త):** వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవు గ్రామంలో నూతనంగా నిర్మించిన స్వర్ణ గ్రామ సచివాలయ భవనాన్ని మంగళవారం ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలందరకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించడానికి ఈ స్వర్ణ గ్రామ సచివాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం సచివాలయ ఆవరణలో మొక్కలు నాటారు.



## పవన్‌కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం



**కొత్తూరు, జూన్ 23 (వార్త):** జనసేన పార్టీ అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీను, మాధురి చేసిన అనుచిత వ్యాఖ్యలను కొత్తూరు మండల జనసేన పార్టీ తీవ్రంగా ఖండించింది. శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కొరికాన రవికుమార్ ఆదేశాల మేరకు కొత్తూరు మండల జనసేన నాయకులు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గతంలో (2025లో) పవన్ కళ్యాణ్ పై దువ్వాడ శ్రీను ఉపయోగించిన పార్లమెంటరీ కాని భాషను, ఇటీవల కాలంలో వారిద్దరూ కలిసి చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుపట్టారు. ఇటువంటి దిగజారుడు వ్యాఖ్యలు జనసైనికుల, అభిమానుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కొత్తూరు పోలీస్ స్టేషన్‌లో వారు ప్రవర్తించిన తీరు, చేసిన వ్యాఖ్యలు సమాజానికి తప్పుడు సంకేతాలు పంపేలా ఉన్నాయని మండిపడ్డారు. రాజకీయాల్లో విమర్శలు ప్రతివిమర్శలు సహజమే అయినప్పటికీ, వ్యక్తిగత దూషణలకు దిగితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ కొత్తూరు మండల అధ్యక్షులు దొంపాక జయరాజు, ఉపాధ్యక్షులు అడపాక అశోక్, నాయకులు ఈసాయ్ వెంకటేష్, తలచంద్రి శివ, మండల ముఖ్య నాయకులు దారపు వినయ్, మెట వినోద్, మధు మరియు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి




**జి.సిగడాం, జూన్ 23(వార్త):** డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్‌ను నడుకుదిటి తేజాబాబు మంగళవారం వాంద్రంగి గ్రామం షిరిడి సాయిబాబా అపార్ట్మెంట్ లో ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళి అర్పించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టికల్ 370ని వెంటనే రద్దు చేయాలనే ఉద్యమ క్రమంలో 1953, జూన్ 23న బలిదానం కావడం జరిగిందన్నారు. ఆయన ఆశయాన్ని ప్రధాని మోదీ 370 ఆర్టికల్‌ను రద్దు చేసి పూర్తిచేశాడని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీసీ ఉపాధ్యక్షులు బురాడ వెంకటరమణ,బీజేపీ మండల అధ్యక్షులు పైల విష్ణుమూర్తి, రాష్ట్ర ఓబీసీ మోర్చా సభ్యులు వజ్జపర్తి రఘురాం, సినియర్ నాయకులు సంపతరావు నాగేశ్వరరావు,బొట్ట భాస్కరావు, ముద్దాడ గౌరీ , బీజేపీ రణస్థలం మండల అధ్యక్షులు మహాంతి అనంత్ తదితర బీజేపీ నాయకులు కార్త కర్తలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో తాపీమేస్త్రి యూనియన్ నేత రామారావు మృతి

- అంతిమయాత్రలో పాల్గొని నివాళులర్పించిన గిరిబాబు

**పలాస, జూన్ 23 (వార్త):** పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ తారక రామా నగర్‌కు చెందిన ప్రముఖ కార్మిక నాయకుడు, పలాస నియోజకవర్గ తాపీ మేస్త్రీ సంఘం అధ్యక్షుడు కుమ్మరి రామారావు (58) సోమవారం రోడ్డు ప్రమాదంలో ఆకస్మికంగా మృతి చెందారు. పేద కుటుంబంలో జన్మించిన రామారావు చిన్న వయసులోనే తాపీ మేస్త్రీగా పనిలోకి దిగారు. చెమట చుక్కలతోనే బతుకుబండిని లాగుతూ తోటి కార్మికుల కష్టాలు కళ్లారా చూసిన ఆయన వారి హక్కుల కోసం గొంతెత్తాలని నిర్ణయించుకున్నారు. గత 20 సంవత్సరాలుగా పలాస నియోజకవర్గ తాపీ మేస్త్రీ సంఘం అధ్యక్షుడిగా పనిచేస్తూ వేలాది మంది కార్మికులకు అండగా నిలిచారు. “ఒక్కడు కాదు, మనమంతా ఒక్కటిగా ఉంటేనే మన కష్టానికి విలువ” అని చెబుతూ కార్మికులను సంఘటితం చేశారు. కూలీ రేట్ల పెంపు, పని ప్రదేశాల్లో భద్రత, ప్రమాద బీమా, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు కోసం నిరంతరం అధికారుల చుట్టూ, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగారు. సంఘం మీటింగ్ అంటే ముందుగా వచ్చి, చివరిగా వెళ్లేవాడని తోటి కార్మికులు గుర్తు చేసుకున్నారు.

“అన్నా, నా కూలి డబ్బులు రాలేదు” అని ఎవరైనా వస్తే, సొంత ఖర్చుతో వెళ్లి కాంట్రాక్టర్‌తో మాట్లాడి ఇప్పించేవాడని చెబుతూ కన్నీరు పెట్టుకున్నారు. రామారావు మృతి వార్త తెలియగానే తాపీ మేస్త్రీ కుటుంబాల్లో విషాదం నెలకొంది. సోమవారం మధ్యాహ్నం జరిగిన ఆయన అంతిమయాత్రలో పలాస–కాశీబుగ్గ మున్సిపల్ మాజీ చైర్మన్ బల్ల గిరిబాబు పాల్గొని పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. “రామారావు మరణం కార్మిక లోకానికి తీరని లోటు. ఆయన లేని లోటు పూడ్చలేనిది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి” అని అన్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ పార్టీ నాయకులు రోనంకి వెంకటరమణ, వల్లభ వైకుంఠరావు, దున్న సత్యం, కాళ్ల తిరుమలరావు, పలు కార్మిక సంఘాల నాయకులు, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, పెద్ద సంఖ్యలో తాపీ మేస్త్రీలు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు. “కార్మిక పక్షపాతి రామారావు అమర్ రహే” అంటూ నినాదాలు చేస్తూ అంతిమ వీడ్కోలు పలికారు. రామారావుకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.



## రైతు సేవా కేంద్రాల్లో రైతన్న మీకోసం

- పంట మార్పిడితో రైతులకు లాభదాయకం
-మండల వ్యవసాయధికారి దానకర్ణుడు



**మెళియాపుట్టి, జూన్ 23(వార్త):** మెళియాపుట్టి మండల పరిధిలో 21 రైతు సేవ కేంద్రాల ద్వారా రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహిస్తామని మండల వ్యవసాయ అధికారి దానకర్ణుడు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రైతన్న మీకోసం కార్యక్రమాన్ని దీనబంధుపురం రైతు సేవ కేంద్ర పరిధిలోనున్న జలకలింగుపురం గ్రామంలలో మంగళవారం నాడు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట మార్పిడి విధానంతో రైతులు ఎక్కువగా లాభ పొందవచ్చునని తెలియజేస్తూనే ఈ విధానంపై రైతులు దృష్టి సారించాలని, ఏలినో ప్రభావం గూర్చి రైతులకు వివిధ అంశాలపై వారికి అవగాహన కల్పించారు. గ్రామాలు, అన్ని ప్రాంతాలలో ఉన్న రైతాంగానికి ఏపీ ఏఐఎంఎస్/ఎఫ్.ఎఫ్.ఎస్. యాప్ ద్వారా రైతులకు సులభతరంగా (యూరియా, డిఏపి) ఎరువులను పారదర్శకంగా పంపిణీ చేసే విధానాన్ని, తక్కువ నీటితో, సూక్ష్మ నీటి సాగుపద్ధతులు, ప్రకృతి వ్యవసాయంపై ప్రతి రైతుకి అర్థమయ్యే రీతిలో తెలియజేసి వ్యవసాయంలో అమలు చేస్తున్న పలు నూతన లాభదాయక విధానాలను గూర్చి తెలియపరిచారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారితో పాటు మండల తహసిల్దార్ పాపారావు, టిడిపి పార్టీ నాయకులు గణపతిరావు, చలపతిరావు, వ్యవసాయ సహాయకులు శివ, రైతులు తదితరులున్నారు.

## బెల్లుపడా బాహుదా గ్రోయిన్ మరమ్మతులకు రూ.20 లక్షల మంజూరు



**ఇచ్ఛాపురం, జూన్ 23(వార్త):** బాహుద నది పై బెల్లుపడా గ్రోయిన్ మరమత్తుల కోసం 20 లక్షల రూపాయల నిధులు మంజూరుఅయ్యావి. ఈ మేరకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం.అశోక్ బాబు కి జిల్లా తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి అన్నా క్యాంటీన్ చైర్మన్ మాజీ కౌన్సిలర్ ఆశి లీలారాణి ఆధ్వర్యంలో నీటి సంఘం అధ్యక్షులు కొచ్చిర్ల. ధనుంజయ రెడ్డి , ఉపాధ్యాక్షులు దుక్క.రామారావు రెడ్డి, రెడ్డిక కోర్పరేషన్ చైర్మన్ కొండ శంకర్ రెడ్డి, బెల్లుపడ గ్రామ రైతులు, పెద్దలు అభినందనలు తెలిపారు. మరమత్తుల పనులు తక్షణమే చేపట్టాలని కోరారు.

## హరిపురంలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ విక్రయాలు

- అరికట్టాలని నాయకుల డిమాండ్

**మందస, జూన్ 23(వార్త):** వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న హరిపురంలో నిషేధిత ప్లాస్టిక్ వినియోగం విచ్చలవిడిగా సాగుతోంది. అధికారుల దాడులు తూతూమంత్రంగా ఉండడంతో వ్యాపారులు ప్లాస్టిక్ వినియోగం పెంచుతున్నారే తప్ప తగ్గించడంలేదని పలువురు పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా కొంచాడ సురేష్ కుమార్, గొలుసు మురళీ, ముడిమించి మధుబాబు హరిపురంలో విలేకరులతో మాట్లాడుతూ మందస మండల తహసీల్దార్ హరిపురంలో ప్లాస్టిక్ విక్రయిస్తున్న షాపులుపై ఆకస్మిక తనిఖీ చేపట్టారన్నారు. ఈ దాడుల్లో ప్లాస్టిక్ అమ్ముతున్న దుకాణాలను గుర్తించి, చర్యలు కూడా తీసుకున్నారన్నారు. మరల విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహసీల్దార్ ఆదేశాలను పట్టించుకోకుండా మళ్లీ విచ్చలవిడిగా ప్లాస్టిక్ విక్రయాలు కొనసాగిస్తూనే ఉన్నారు. రాష్ట్రంలో పెద్ద పెద్ద పట్టణాలో ప్లాస్టిక్ విక్రయాలు అరికట్టి పర్యావరణాన్ని హానికరం చేయని సంచులు వినియోగంలో ఉన్నాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం అరికట్టక పోవడం విచారకరమన్నారు. ప్రక్కనే ఉన్న ఒడిశా నుండి పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ దిగుమతులు జోరుగా జరుగుతుండడంతో హరిపురం, మందసలో ప్లాస్టిక్ విక్రయాలు జోరుగా సాగుతున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు, పోలీసులు నిషేధిత ప్లాస్టిక్ సంచుల వ్యాపారాన్ని అరికట్టాలను వారు కోరారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక



# అధ్వానంగా ప్రాంతీయ ఆసుపత్రి రహదారి

**- వర్షపు నీరు నిల్వతో రోగులు, స్థానికులకు తీవ్ర ఇబ్బందులు**

**- తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ప్రజల విజ్ఞప్తి**

**నరసన్నపేట, జూన్ 23 (వార్త):** నరసన్నపేట ప్రాంతీయ ఆసుపత్రికి వెళ్లే ప్రధాన రహదారి అధ్వాన స్థితికి చేరుకోవడంతో రోగులు, వారి కుటుంబ సభ్యులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా రహదారిలో పెద్దఎత్తున వర్షపు నీరు నిల్వ ఉండిపోవడంతో రాకపోకలు మరింత కష్టసాధ్యంగా మారాయని ప్రజలు వాపోతున్నారు. ప్రతి రోజూ ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చే రోగులు, వృద్ధులు, గర్భిణులు, అత్యవసర సేవలు పొందాల్సిన వారు ఈ రహదారిపై ప్రయాణించాల్సి వస్తుండటంతో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. రహదారిలో గుంతలు, బురద, నిల్వ నీరు కారణంగా వాహనాలు సైతం నెమ్మదిగా కదలాల్సి వస్తోందని తెలిపారు. ఆసుపత్రి వంటి అత్యవసర సేవల కేంద్రానికి వెళ్లే మార్గం ఇంత దారుణంగా ఉండటం బాధాకరమని ప్రజలు అంటున్నారు. వర్షపు నీరు నిల్వ ఉండటంతో నడిచే వారికి కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయని, కొన్నిసార్లు జారిపడే ప్రమాదం కూడా ఉందని పేర్కొంటున్నారు.



ప్రాంతీయ ఆసుపత్రికి వెళ్లే ఈ రహదారి పరిస్థితిపై స్పందించి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని స్థానికులు రహదారిని త్వరితగతిన బాగుచేసి సౌకర్యవంతమైన సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే కోరుతున్నారు. రోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రాకపోకలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



## రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

**ఇచ్ఛాపురం, జూన్ 23(వార్త):** లొద్దపుట్టి జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రూరల్ ఎస్ఐ ఆర్.జనార్ధనరావు తెలిపారు. వీఆర్ఓ శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## శ్యాం ప్రసాద్ ముఖర్జీకి నివాళి



**సోంపేట, జూన్ 23(వార్త):** భారతీయ జనతా పార్టీ పూర్వ రూపమైన భారతీయ జనసంఘ పార్టీ వ్యవస్థాపకులు, కాశ్మీర్ కోసం బలిదానం అయిన మహానుభావులు శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా సోంపేటలో పలువురు బిజెపి నేతలు మంగళవారం ఆయన చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. యువతకు ఆదర్శనీయుడని అన్నారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, జిల్లా కార్యదర్శి బీన వంశీ, మండల పార్టీ అధ్యక్షుడు తెరుకోటి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే జుత్తుకు ఘన నివాళులు



**సోంపేట జూన్ 23 (వార్త):** పలాస మాజీ ఎమ్మెల్యే జుత్తు జగనాయకులు 67వ జయంతి కార్యక్రమం ఈ మండలం బారువ గ్రామంలో మంగళవారం సాయంత్రం అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా జగన్ నాయకులు చిత్రపటం వద్ద పూలమాలలు వేసి అగ్నికుల క్షత్రియ ప్రముఖులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల నుంచి రాజకీయాల్లోకి వచ్చి ప్రజా సేవా కార్యక్రమాల ద్వారా ఆకర్షితుడై కాంగ్రెస్ పార్టీలో పలాస ఎమ్మెల్యేగా ఎన్నికై గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి జగన్నాయకులు అహర్నిశలు శ్రమించారని అన్నారు. అటువంటి నాయకుడు అందరికీ ఆదర్శమని అన్నారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేష్ కన్నా, కర్రీ సత్యం,తెప్పల కృష్ణారావు, తెప్పల ధర్మారావు, దున్న అశోక్, గుర్రాల శ్రీను,తెప్పల తిరుపతి, ఈరోతు పాపారావు తదితరులు పాల్గొన్నారు.



# నిలిచిన రాయల - బంకి రోడ్డు పనులు

**-చెరువు గట్టుకు ప్రమాదం**

**-పనులు పూర్తి కాకుండానే బిల్లుల చెల్లింపు**

**-అధికారుల్లారా ఇదెక్కడి న్యాయం**

**- ఈ అక్రమాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తా : కలమట**

**కొత్తూరు, జూన్ 23(వార్త):** కొత్తూరు మండలంలోని రాయల – – బంకి గ్రామాలను కలుపుతూ మంజూరైన బీటీ రోడ్డు పనులు మధ్యలోనే నిలిచిపోవడంపై మాజీ ఎమ్మెల్యే కలమట తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన సంఘటనా స్థలాన్ని సందర్శించి క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించారు. గత మార్చి నెలలో రాయల చెరువు గట్టుపై ట్రెంచ్ (అగడ్త) తవ్వకాలు చేపట్టి, ఆ తర్వాత పనులను అలానే వదిలేయడం వల్ల స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు అంతర్భాగంలో ట్రెంచ్ తవ్వడం వల్ల చెరువు గట్టు పూర్తిగా బలహీనపడిందని పేర్కొన్నారు. ప్రస్తుతం భారీగా నీరు చేరుతున్న నేపథ్యంలో గట్టు తెగిపోయే ప్రమాదం పొంచి ఉందని, ఒకవేళ గట్టు తెగితే చెరువు దిగువన ఉన్న రాయల, మాకవరం, కుద్దిగం, పొన్నుటూరు గ్రామాలకు చెందిన రైతుల వందల ఎకరాల పంటలు పూర్తిగా నీట మునిగి నష్టపోయే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజల ప్రాణాలు, రైతుల పంటల భద్రతను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మరోవైపు, రోడ్డు పనులు పూర్తి కాకుండానే సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై బిల్లులు మంజూరు చేసుకున్నట్లు సమాచారం అందుతోందని కలమట ఆరోపించారు. ఈ వ్యవహారంలో స్థానిక పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారుల పాత్రపై అనేక అనుమానాలు ఉన్నాయని, దీనిపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. తక్షణమే చెరువులో తవ్విన ట్రెంచ్‌ను పూడ్చివేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# అక్రమార్కులపై పోలీసుల డేగ కన్ను

**-ఎస్ఐ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో డ్రోన్ నిఘా**

**మందస, జూన్ 23(వార్త):** అక్రమార్కుల భరతం పట్టడానికి పోలీసులు చర్యలు వేగవంతం చేశారు. మందస ఎస్ఐ కూటికుప్పల కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో ఆధునిక సాంకేతికను వినియోగించి, అక్రమార్కులను గుర్తించడానికి చర్యలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా విహంగ వీక్షణం చేస్తున్నారు. అనుమానిత ప్రాంతాల్లో డ్రోన్ ద్వారా సర్వే చేస్తున్నారు. చట్ట వ్యతిరేక పనులను డ్రోన్ ద్వారా గుర్తించడానికి ప్రయత్నాలను ప్రారంభించారు. శ్రీకాకుళం జిల్లా ఎస్.పి. ఆదేశాల మేరకు మందస పట్టణం పరిధిలో డ్రోన్ ద్వారా కొన్ని ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాలను వీక్షించారు. శ్రీవాసుదేవ పెరుమాళ్, చీపి, భైరిసారంగపురం తదితర ప్రాంతాల్లో డ్రోన్ ఎగురవేసి, ఆయా ప్రాంతాలను నిశితంగా పరిశీలించారు. ఆయా ప్రాంతాలకు సంబంధించిన వీడియో, ఫోటోలు ఖచ్చితత్వంతో రావడంతో పాటు ఆయా ప్రాంతాల్లోని మనుషులు, జరుగుతున్న యాక్టివిటీస్ పోలీసులకు చాలా స్పష్టంగా తెలుస్తుంది. పేకాట, నాటుసారా అమ్మకాలు, ఇతర చట్టవ్యతిరేక పనులను పోలీసులు గుర్తించడానికి డ్రోన్ ఎంతో సహకరిస్తుందని ఎస్ఐ కృష్ణప్రసాద్ చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చట్ట వ్యతిరేకమైన పనులు చేయవద్దని హితవు పలికారు. ఇప్పటికే అనుమానిత ప్రాంతాలు, పేకాట జరిగే ప్రదేశాలు, నాటుసారా వ్యాపారం జరిగే ప్రాంతాలను గుర్తించడం జరిగిందన్నారు. ఆయా ప్రాంతాల్లో నిరంతర డేగ కన్ను నిఘా ఉంటుందన్నారు. నేరస్తులను డ్రోన్ ద్వారా గుర్తించి, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల్లో మార్పు రావాలని హితవు పలికారు. లేకపోతే ఆధునిక సాంకేతికతను వినియోగించి, చట్ట వ్యతిరేకమైన పనులు చేసేవారిని గుర్తించి, వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.



# దోమల నియంత్రణపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

**- వ్యాధుల నివారణకు నీటి నిల్వ లేకుండా చూడాలి**

**- యారబాడులో విద్యార్థులతో అవగాహన కల్పించిన ఉర్లాం పీహెచ్‌సీ సిబ్బంది**

**నరసన్నపేట, జూన్ 23(వార్త):** దోమల ద్వారా డెంగ్యూ, మలేరియా వంటి పలు వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉన్నందున వాటి నియంత్రణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని జాగ్రత్తలు పాటించాలని హెల్త్ అసిస్టెంట్ రామచంద్రరావు సూచించారు. మంగళవారం నరసన్నపేట మండలం ఉర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో యారబాడు సచివాలయ పరిధిలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లోనూ గృహాల పరిసరాల్లోనూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం దోమల నివారణలో కీలకమని చెప్పారు. పాత టైర్లు, కూలర్లు, డబ్బాలు, కొబ్బరి చిప్పలు, మురుగు నీటి గుంతలు వంటి ప్రదేశాల్లో నీరు నిల్వ ఉంటే దోమలు పెరిగే అవకాశాలు అధికంగా ఉంటాయని హెచ్చరించారు. దోమల నివారణ కోసం ఇంటి చుట్టుపక్కల పరిశుభ్రత పాటించడంతో పాటు తాగునీటి ట్యాంకులు, బిందెలు, డ్రమ్‌లు మూతపెట్టాలని సూచించారు. జ్వర లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు గ్రామ వీధుల్లో తిరుగుతూ దోమల నియంత్రణ,



పరిశుభ్రత, నీటి నిల్వల నివారణపై నినాదాలు చేశారు. ప్రజలు కూడా ఆరోగ్య సిబ్బందికి సహకరించి దోమల వ్యాప్తి నిరోధానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు, స్థానిక సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పీఏంఎంవీవై లబ్ధిదారుని బ్యాంకు ఖాతా ఎన్.పి.సి.ఐతో అనుసంధించాలి



**పలాస, జూన్ 23 (వార్త):** లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలు తప్పనిసరిగా ఎన్.పి.సి.ఐతో అనుసంధానించాలని కాశీబుగ్గ ఐసిడిఎస్ పీవో కే పార్వతి అన్నారు. కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న సూపర్వైజర్లకు, అంగన్వాడి కార్యకర్తలకు మంగళవారం పలాస ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీడీపీఓస్ఁ సూపర్వైజర్స్ అందరు తమ పరిధిలోని ఏడబ్ల్యుసి స్థాయిలో పీఎం ఎంవివై లబ్ధిదారుల నమోదులను పర్యవేక్షించవలసింది గా సీడీపీఓలు, సూపర్‌వైజర్‌లందరికీ విజ్ఞప్తి చేశారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలు తప్పనిసరిగా అనుసంధానించబడాలి (బ్యాంక్ అకౌంట్ సీడింగ్). బ్యాంకు ఖాతా ఎన్.పి.సి.ఐతో అనుసంధానించబడకపోతే, నమోదు సూపర్‌వైజరీ స్థాయికి వెళ్లదని, సిస్టమ్‌లో కనిపించదని చెప్పారు. ఎన్ పిసిఎల్ అనుసంధానం పూర్తయిన తర్వాత మాత్రమే నమోదు సూపర్‌వైజర్ స్థాయికి వెళ్తుందని, అందువల్ల, ఇది సాంకేతిక సమస్య కాదని అన్నారు. ప్రతి పిఎంఎంవివై లబ్ధిదారుని బ్యాంకు ఖాతా తప్పనిసరిగా ఎన్.పి.సి.ఐతో అనుసంధానించబడిందని నిర్ధారించుకోవడానికి అంగన్వాడి కార్యకర్తలకు మార్గనిర్దేశం చేసి, సూచనలు ఇవ్వవలసిందిగా సీడీపీఓలు, సూపర్‌వైజర్‌లందరికీ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సూపర్వైజర్లు లత, గంగమ్మ, అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సర్‌పై బీఎల్‌ఏలకు అవగాహన




**జి.సిగడాం, జూన్ 23(వార్త):** సర్ ప్రక్రియపై ఏజెంట్లకు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఎమ్మెల్యే కుమారుడు నడుకుదిటి తేజా బాబు అన్నారు. మంగళవారం వాంద్రంగి గ్రామంలో బీజేపీ ముఖ్యనాయకులు, ఎజెంట్లు, కార్యకర్తతో సమావేమయ్యారు.సర్ ఉద్దేశాన్ని, ప్రాముఖ్యతను ప్రజలకు వివరించి, ఈ విధానాలపై ఉన్న అపోహలను తొలగింపజేయలని ఆయన సూచించారు.బూత్ లెవెల్ ఏజెంట్స్ (బీఎల్ ఏ)లతో అవగాహన సమావేశం నిర్వహించారు.అర్హులైన ప్రతి ఒక్క పౌరుడు ఓటరుగా నమోదు అయ్యేలా బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఓటర్ల జాబితాలో ఉన్న తప్పులను గుర్తించి సవరణలు చేపట్టేందుకు కృషి చేయాలని, అర్హులైన ఓటరు ఓటర్ల జాబితా నుండి తొలగింపు లేకుండా చూడాలన్నారు.ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు మూలస్తంభమన్నారు. ప్రతి ఓటరు తమ ఓటు హక్కుపై అవగాహన పెంపొందించే దిశగా బూత్ లెవెల్ ఏజెంట్లు కృషి చేయాలన్నారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా, ఖచ్చితంగా ఉండేందుకు ఎన్నికల సంఘం చేపడుతున్న సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో బూత్ లెవెల్ ఏజెంట్లపాత్ర ఎంతో కీలకమన్నారు. ఈ సమావేశంలో ఎఎంసీ ఉపాధ్యక్షులు బురాడ వెంకటరమణ, బీజేపీ జి.సిగడాం, రణస్థలం మండల అధ్యక్షులు రైల విష్ణు మూర్తి, రాష్ట్ర బీజేపీ మోర్చా సభ్యులు వజ్జపర్తి రఘురాం, సీనియర్ నాయకులు సంపత నాగేశ్వరావు,బోట్ల బాస్కరారవు, ముద్దాడ గౌరీ, నాయకులు, కార్యకర్తలు పాల్గోన్నారు.

## కొత్తూరులో బీఎల్‌ఏలకు వైసీపీ నేతల దిశా నిర్దేశం

**కొత్తూరు, జూన్ 23 ( వార్త ) :** పాతపట్నం నియోజకవర్గ మాజీ శాసనసభ్యురాలు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి ఆదేశాల మేరకు కొత్తూరు మండలం గునభద్ర ఆర్ అండ్ ఆర్ కాలనీ పరిధిలో సోమవారం బూత్ లెవెల్ ఏజెంట్ల ఇంటింటి సర్వేను పార్టీ సీనియర్ నేతలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొత్తూరు బీఎల్ఏల ఇన్‌ఛార్జీలుగా వ్యవహరిస్తున్న శ్రీకాకుళం జిల్లా వైయస్ఆర్సీపీ అధికార ప్రతినిధి సిమ్మ సాంబశివరావు, వైయస్ఆర్సీపీ రాష్ట్ర బూత్ కమిటీ కార్యదర్శి రెడ్డి రామారావు,మండల వైయస్ఆర్సీపీ అధ్యక్షుడు గండివలస ఆనంద రావు,గ్రామ మాజీ సర్పంచ్ సాదు బాబు లతో కలిసి సర్వే తీరును పర్యవేక్షించారు. ఓటర్ల జాబితాలో కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, తొలగింపులు వంటి అంశాలపై బీఎల్ఏలతో వారు చర్చించి పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం ఆదేశాల ప్రకారం ప్రతి ఇంటినీ సందర్శించి అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితాలో మిస్ కాకుండా ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించాలని సూచించారు. సర్వేలో గుర్తించిన లోటుపాట్లను వెంటనే సరిదిద్దడంతో పాటు ప్రక్రియను మరింత వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని బీఎల్ఏలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వి. లక్ష్మీనారాయణ, వైసీపీ గ్రామ పెద్దలు, బూత్ కన్వీనర్లు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రతి బూత్ పరిధిలో సర్వే పురోగతిని సమీక్షించారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL/2023/87546